Reg. No. 757

అభినవసరస్వతి

యను నొక మాసపత్రిక.

నాగరఖండ స్వర్ణకారవ్యవహారాది బహుగ్రంథకర్తయగు

జానపాటి పట్టాభిరామశాస్త్రిచే

ప్రచురింపఁబడుచున్నది.

జానపాడు.

సంపుటము 22 — 1930 సం॥ మే నెల — సంచిక 2

విషయములు.

చందానిర్ణయము సంవత్సరమునకు

ప్రధానపోషకులకు	రు 25 0 0	సహాయులకు	రు 5 0 0
పోషకులకు	రు 10 0 0	చందాదారులకు	3 0 0

Printed at the Chandrika Press, Guntur,
and published at Janapadu by the Editor, Astavadhani
Janapati Pattabhirama Sastry,
author of Nagarakhandam, Swarnakaravvavaharam
etc., etc.

ప్రధానపోషకులు.

౧ శ్రీ శ్రీ జగద్గురు అభినవోద్దండ విద్యారణ్య భారతీస
౨ శ్రీ శ్రీ జగద్గురు అభినవోద్దండ విద్యానృసింహ భారతీస్వాములు.
౩ వాకరాజు పరాంకుశరావు దేశాయిగారు యాదవరం.
౪ రామసింగుగారు - నెల్లుట్ల
౫ ఇనిగెల వెంకటధర్మారెడ్డి సర్దేశముఖుగారు - ఆత్మకూరు
౬ తంగెడ నరసింహారావుగారు, కరణం, మోర్తంపాడు.

పోషకులు.

౧ రాజా వెంకటాద్రియప్పారావు, బహదరు జమీందారుగారు-నూజవీడు
౨ గూడూరి వీరసాంబశివరావు సర్దేశపాండ్యాగారు, మానకొండూరు
౩ జాగర్లమూడి కుప్పుస్వామిచౌదరిగారు, కారంచేడు
౪ నెల్లుట్ల నరసింహారావుగారు, జనగాం
౫ లింగాల వెంకటరెడ్డి దేశముఖుగారు, కుందవరము
౬ రంగాచార్యులుగారు, ముక్తారు, దేశముఖు, మసీదుపల్లి
౭ చారబుడ్డి రత్నారెడ్డిపటేలుగారు, [illegible]
౮ రామయాంబికా పుస్తకభాండాగారము, లక్ష్మీనర్సాపురము
౯ టి. లక్ష్మణసింగుగారు, జనగాం
౧౦ రాజా మంత్రిప్రగడ వెంకటహనుమంతరావుగారు, లింగగిరి.
౧౧ పిశుపాటి వెంకటరాయశర్మగారు, కరవది
౧౨ శ్రీ శ్రీ జగద్గురు అభినవ విరూపాక్ష పీఠాధిపతులు, దుగ్గొందూరు
౧౩ శ్యామాపంతుల వెంకటేశ్వరరావుగారు, తహశీల్దారు, ఆరుమూరు.
౧౪ కొత్వాలి వెంకటేశ్వరరావుగారు, సంగెం
౧౫ లింగాల రంగారెడ్డి దేశముఖుగారు, గణపురం,
౧౬ రాజా కందుకూరు బాలసూర్యప్రసాదరావు బహద్దరు, జమీందారుగారు-
౧౭ సాకుంట శివరాజారావు దేశముఖ్ గారు, జగిత్యాల.
౧౮ కురికాల వెంకటేశ్వరరావుగారు. పరకాల.

సహాయులు

౧ మెదక్ శివరాజారావు దేశముఖుగారు, నల్లపల్లి
౨ వీరకాయల హనుమంతరావు దేశపాండ్యాగారు, రాయగిరి
౩ లక్ష్మీనరసింహస్వామివారు, యాదగిరి
౪ నెల్లుట్ల కేశవరావు దేశముఖుగారు, హాపురం
౫ వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు, చెన్నపట్టణము.
౬ పెద్దిభట్ల వీరయ్యగారు, ప్లీడరు బెజవాడ
౭ తిప్పరాజు కామేశ్వరరావుగారు, కరణం, దుగ్గిరాల

అభినవసరస్వతి.

సంపుటము	జానపాడు	సంచిక
౧౧	ప్రమోదూత సం॥ వైశాఖమాసము	౧

ఆంధ్రకర్ణాటక బ్రాహ్మణ సమ్మేళనము.

—(:o:)—

1930 వ సం॥ ఏప్రిలు 12, 13, 14 తేదీలలోఁ బైసమ్మేళనము జరిగియున్నయది. ధర్మవిరుద్ధములగు ప్రస్తుతపరిస్థితులకును నందును నుతింత యాందోళనమునకుఁ గారణమైన శారదాశాసనమునకును బ్రతిక్రియఁ గల్పుట సనాతనధర్మానుయాయులగు సకలజనులకును ముఖ్యకర్తవ్యమగుట యట్లుండ ధర్మాచార్యులకుఁ దప్పనిపనియగుటచే శ్రీ శ్రీ జగద్గురు విరూపాక్షపీఠాధిపతులీసభ కధ్యక్షులై జయప్రదముగ సాగింపఁజేసినందుల కెంతయు వందనీయులు. ఆవిరూపాక్షపీఠమున కాదిమస్థానము హంపీక్షేత్రమగుట దత్రత్య దేవస్థాన ధర్మాధికారము తత్పీఠాధికారులే వహించుచున్నవారు అయినను దత్కార్య నిర్వహణభార మాస్తికభూషణ బిరుదాంకితులగు జాజాల వెంకటేశ్వరశాస్త్రిగారికై బెట్టి యాపీఠాధిపతులు శిష్యులం బునీతులఁజేయ దేశసంచార మొనరించుచుండిరి. పండరీపురము మొదలుగాగల విస్తృత కర్ణాట మహారాష్ట్రదేశములుగూడఁ దమ యాధిపత్యముక్రింది వగుటఁ దత్సంచారము చిరకాలమునుండియుఁ దత్ప్రాంతములయందే కావింపఁబడుచున్నది. విద్యారణ్య భారతీస్వాముల కాలముననే విద్యానగరమును వీడి వెడలిన యాపీఠమునఁ బ్రకృతము సచ్చిదానందాభినవశంకరభారతీస్వాములవారు పట్టభద్రులైయున్నవారు. ఆవారి సుబ్బయ్యశాస్త్రిగారును వెంకటరామశాస్త్రిగారును దదాస్థానమున ముఖ్యమంత్రులు. అట్టి మంత్రిద్వయమును హంపీక్షేత్రస్థ దేవస్థాన కార్యనిర్వాహకులగు వెంకటేశ్వర శాస్త్రిగారును బ్రకృతపరిస్థితులఁ బరికించి పరిషన్ముఖమునఁ బ్రబోధించినఁ గాని ప్రజలు భద్రములఁబడయఁ జాలరని పర్యాలోచించి బ్రాహ్మణమహాసమ్మేళనమునకుఁ బ్రయత్నించిరి. అభ్యర్థించి యాచార్యులను హంపీక్షేత్రమునకు రప్పించిరి. వెంకటేశ్వరశాస్త్రిగారి యాదరములును నాంధ్రవిశ్వవిద్యాలయమునకు సెనేటు సభ్య

లును, ఆదవాని తాలూకాబోర్డు వైస్ ప్రెసిడెంటులును నగు జూజాల శ్రీనివాస శాస్త్రిబియేగా రాహ్వానసంఘాధ్యక్షుల కంగీకరించిరి. చెన్నపురి నెల్లూరు బెజవాడ బెంగుళూరు మున్నగు ముఖ్యపట్టణంబులనుండియుఁ బల్లెలనుండియు వేదశాస్త్ర విదులగు విద్వద్బ్రాహ్మణులు విచ్చేసిరి. దినత్రయమును దివ్యముగా సభకూడెను. అంబడిపూడి విశ్వనాథసిద్ధాంతిగారు కైప సుబ్రహ్మణ్యశర్మగారు పుష్పగిరి సంస్థానమునకు సంబంధించిన వెంకటసుబ్బాశాస్త్రిగారు మున్నగు ననేకులప్పట్లు నుపన్యసించిరి. శారదాశాసనమును రద్దుపఱచి రాఁబోవు రౌండుటేబిల్ కాన్ఫరెన్సులో సనాతనధర్మమునకుఁ దగు కట్టుదిట్టము లొనర్పవలెననియుఁ బూర్వమొనర్చిన వాగ్దానముప్రకారము మతవిషయములలోఁ దాటస్థ్యము వహింపవలెననియుఁ బ్రభుత్వము వారిని బ్రార్థించుచు సభ సమాప్తిఁజేసిరి.

—* ఆహ్వానసంఘాధ్యక్షోపన్యాసము. *—

శ్లో. హేమకూట నిలయః పంపాలింగన కాముకః,
గంగాధరో విరూపాక్షో మంగళం దిశతాత్సదా.

వైదిక మతాభిమానులారా!

అనాదికాలమునుండి నేటివరకు పరమపావన ప్రదేశమని వాసిగాంచి కర్ణాటక సింహాసన స్థాపనాచార్యుఁడగు శ్రీవిద్యారణ్య యతిసార్వభౌముని యమానుష మహిమచే వన్నెకెక్కిన ఈపంపాక్షేత్రమందు మీయందరి సమ్మేళనము గలిగించు భాగ్యము మామండలమువారి కొదవినందుకు మేమెంత ధన్యులమో చెప్ప నలవికాకున్నది. బహుశ్రమలకోర్చి యెండనక, గాలియనక, స్వకార్యములనెల్లఁ బోనాడి బహుదూరదేశములనుండి వైదికధర్మోద్ధరణమునకై యత్యుత్సాహముతో నేతెంచిన మహావిద్వాంసులును భూలోకదేవతోత్తములగు మీయెడ నేనెట్టి స్వాగతోపచారవాక్యము లాడవలెనో తోఁచకున్నది. ఇట్టితఱి నొకరితో నొకరు వర్తమాన వృత్తాంతములగూర్చి ముచ్చటించుకొని కర్తవ్యమునకుఁ గడంగుటయే భావ్యమని భావింతు.

సభ్యమహాశయులారా!

కాలగతిని బట్టిచూడగా, ప్రాచీన సంప్రదాయములన్నియు మారుచున్నవి ప్రతియొకరును కేవలము వాక్కుచేఁ బలుకువారే కాని, నిర్వ్యాజమగు ననుష్ఠానము గలవారు మిక్కిలి తక్కువగుచున్నారు. ఇందుచే వైదికధర్మములకును తదనుష్ఠాతలకును వ్యవహారప్రపంచములో లౌకిక సాంఘిక రాజకీయములందు పలుకుబడి పూర్తిగా

లేదు. లోకవ్యవహారజ్ఞులగు వారికి వైదికధర్మములన నెట్టివో తెలియకున్నవి. ఒక వేళ తెలిసినను నవ్వానియందు విశ్వాస మొకింతేనియుండుటలేదు. మఱియు నట్టివా రుదాసీనతతో నుండక నాస్తిక హేతువాదములచే కుతర్కములఁజేసి వేదమతమును నిర్మూలముచేయుటకై కంకణము గట్టుకొనియున్నారు. ఇట్టికఠోరస్థితిలో నందరు నొకేవిధముగా తాత్సారము వహించి యున్నచో పిదప నేమితటస్థించునో యను విషయమును కంఠోక్తిగాఁ జెప్పఁబనిలేదు. మునుముందు మన యావశ్యక గ్రంథముల నాలోచించుటయే యీసమ్మేళనముయొక్క బాధ్యతయని భావించుచున్నాము.

ఇటీవల కొన్నినాళ్ళనుండి జాతి, మత, సాంఘిక, దైవికవిషయములలో క్షోభలెక్కువగాఁ గన్పట్టుచున్నవి. దేశములో నెచట వెదకినను శాంతిలేదు. లౌకిక రాజకీయములలో పలుకుబడిగలవారిలో చాలమట్టుకు సంఘసంస్కర్తలైయున్నారు. వారిమాటలే ఎచటజూచినను ప్రాముఖ్యమునకు వచ్చుచున్నవి. ఇటీవల గర్భాధాన వయోనిర్ణయ సంఘమువారు బహుకాలము మనభారతదేశమును పూర్తిగా దిరిగి యచ్చటచ్చట సాక్ష్యములగైకొని తుదకు ప్రచురించిన రిపోర్టును, దానిఫలితములును మీకందరికిని గోచరమైనవే. ఇట్టివే మరికొన్ని కానున్నవి. దేశములో రాజ్యాంగమందు ధర్మనిర్ణయ సంఘములనగా నీరీతితో నున్నవని తెల్పుటకై పైదాని నుదాహరణముగాఁ జూపితిని. ఇట్టి సంఘముల యభిప్రాయముల పైననే ప్రభుత్వము వారిదృష్టి పూర్ణముగా ప్రసరించుచున్నది. వైదిక మతాభిమానులగు వారందరు లౌకిక రాజకీయవ్యవహారములలో బ్రవేశింపక తాత్సారము జూపుటయు, స్వమత యనుష్ఠానములలో నిర్వ్యాజశ్రద్ధ వహింపకుండుటయే యిన్నిటికి గారణమైయున్నది తలఁచినంతమాత్రముననే భూదేవతను కనకవృష్టిచే నలంకృతఁగావించిన బ్రాహ్మతేజమిపు డెందుబోయినది? తృణీకృత బ్రహ్మపురందరులై యోగనిష్ఠా సమాసక్తులగు ఋషిపుంగవుల దివ్యమహిమ లెందుదాగినవి? కేవలము భూతపూర్వవైభవముల శ్లాఘించుకొనుటతోఁ దృప్తినొందుట మనకు ప్రకృతము యుక్తము కాదు. జీవనోపాయముగా నెట్టివిద్యనభ్యసించినను సాధ్యమయినంతమట్టుకు నుచితమగు సమయములఁ గల్పించుకొని వేదశాస్త్రముల నభ్యసించుట, ఆచారానుష్ఠాన కాండములఁ బాటించుట మున్నగు నవశ్యవిధుల మనవారు ఖండితముగా నాచరింపవలసి యున్నది లేనిచో నాస్తిక్యము మిక్కిలి వ్యాపించునను సూచన లగపడుచున్నవి

మనబ్రాహ్మణులలో పైజెప్పినముఖ్యకార్యములు లోపించియుండుటచేతనే సంఘసంస్కర్తలవలీలగా శాసనసభలో శారదాచట్టము విషయములో జయమును పొందగలిగిరి. బ్రాహ్మణేతరులు, నిమ్నజాతులుమున్నగువారు మమ్మసాహసించి తూల

నాడుటను గడేగిరి దేశములో వీలివలనకలుగు క్షోభలిట్టివని చెప్పుట కలవిగాకున్నది. మహాశయులారా! పైశారదాశాసన మొకటియే. కాదు ఇట్టి చండశాసనము లింకెన్నియో రానున్నవి అందుకు తగిన యనుకూలావకాశములు కూడ దేశములో ప్రబలుచున్నవి. మనమూరకున్నచో స్వారస్యములేదు కార్యము చెడును. సంభవించిన కష్టముల మాన్పుకొనుటకును, ఉత్తరత్ర జాగరూకులై వర్తించుటకును తగిన వ్యవస్థలు కావలసియున్నది. లేనిచో బ్రాహ్మణ్యమే క్షీణించు నను నిశ్చయసూచనలు పొడముచున్నవి ప్రతిరాష్ట్రమందును తగు నాందోళనము సల్పి పైవిషయములను గురించి తీవ్రచర్యల పుచ్చుకొనవలెను. ఇవన్నియు కేవల మొకరివల్ల నెరవేరునట్టివి కావు "సంఘేశక్తిః కలౌయుగే" యను నార్యోక్తిచొప్పున, పరస్పర స్పర్థల విడిచి ఏకకుటుంబమువారమను దృఢభావనతో మనమందరము గలసి యొక వ్యవస్థ నేర్పఱచుకొని కార్యరంగములోఁ బ్రవేశింపవలసియున్నది

మహనీయులారా! ఇట్టిసౌహార్దము గల్గజేసి కర్తవ్యము నిర్ణయించుటకే యాంధ్రకర్ణాటక రాష్ట్రనివాసులగు మిముబోంటి బ్రాహ్మణమహాజనుల సమ్మేళనము గావించితిమి ఇట్లు రాష్ట్రద్వయమువారి నాహ్వానించి సమ్మేళన మొదవించుట కితరమండలములకన్న ఆంధ్రకర్ణాటక రాజ్యలక్ష్ములకు సమప్రతిపత్తియున్నమాయీ బళ్ళారిమండలమున కెక్కుడుబాధ్యత స్వయంసిద్ధమైనదని నొక్కి వక్కాణించుచున్నాను. అందువల్ల ఒకవంక నాంధ్రభోజమహీపాలుఁడును, మరొకప్రక్కన కర్ణాటక సింహాసన స్థాపనాచార్యుఁడును గలుగ, తుంగభద్రాస్రవంతీ శీతలశీకరాసారముచే నతిపవిత్రమై వెలసి నాటికి నేటికిని శ్రీపంపా విరూపాక్షేశ్వర, శ్రీకోదండరామప్రభృతి దేవతాగణముల దివ్యవైభవములతో వెలయుచు దక్షిణకాశియని వాసిగాంచిన యీపంపామహాక్షేత్రమునకు మిమ్ముల నాహ్వానించి యీ సమ్మేళనమును జయప్రదముగ నిర్వహింపఁబూనితిమి. మిగుల జనసమ్మర్దముగల యీసమయములో విభిన్నాహారవ్యవహారములుగల మీకు మాచేయు నుపచారము లెన్నటికిని హితములు గావేమో యని మనస్సులో సంకోచమున్నను, కార్యదృష్టిగల మిముబోంట్లు మము మన్నింతురను గట్టినమ్మకముతో ఇట్టిసాహసిక ప్రయత్నమున ర్చితిమి. మాయందు విశ్వాసముంచి బ్రాహ్మణధర్మముల నుద్ధరించుటకొరకై వివిధ శ్రమలకోర్చి యేతెంచిన మీకు సుస్వాగత మగుగాక మీయందరి మహాసమ్మేళనము గాంచగా ఆయజ్ఞపురుషుడే మూర్తీభవించి ధర్మరక్షణమునకై వచ్చెనా యను నిశ్చయము గలుగుచున్నది ధర్మాచార్యులగువా రధ్యక్షపదవి నంగీకరించుటచే ప్రకృతపరిస్థితులగూర్చి వివరింపవలసిన యెక్కుడుబాధ్యత నాకు తొలఁగినందు కెంతేయు సంతసించుచున్నాను.

అధ్యక్షోపన్యాసము.

అనాద్యవిద్యావ్యామోహ తమస్స్తోమ రవిద్యుతి,
స్తుమ స్తచ్ఛాంకరం ధామ కర్మ బ్రహ్మోభయాత్మకం.

ఆస్తిక శేఖరులారా!

బహుకాలమునుండి యితరరాష్ట్రము లందు సంచరించుచున్నను మాయందు దవిచ్ఛిన్న విశ్వాసముగలిగి మీరందఱు నిట్టిమహాసభకు మాయధ్యక్షతఁ గోరుట యనునది మీభక్తిశ్రద్ధల ... చాటుచున్నది. ...పశ్చిమబుద్ధులైయుండు మన బ్రాహ్మణులకుఁ గాలప్రవాహ మెట్లు నడుచుచుండునది గోచరించుటయే లేదు. ఇట్టితఱి మీరందఱుఁ గూడి శ్రీపంపావిరూపాక్షేశ్వరుల సన్నిధానమున నీసంమేళనమును గావించి రాష్ట్రములలో వర్ణాశ్రమధర్మములు విషయమై ప్రబోధ మొనర్పఁ బూనుట యతి సమంజసమును నత్యావశ్యకము నైన కార్యమై యున్నది. మీప్రయత్నమునకు నిర్విఘ్నసిద్ధి కల్గుగాక. ...

ప్రకృతకాలపరిస్థితులు పూర్తిగా విషమించినవి. వైదికపద్ధతులకుఁ బలుకుబడి మిక్కిలిఁదగ్గినది. వర్ణాశ్రమ ధర్మములన్న నామమాత్రావశిష్టము లగుచున్నవి. లౌకిక రాజకీయములలో నెచటఁజూచినను ధర్మనిర్మూలనమునకే ముఖ్యముగాఁ బ్రయత్నములు సాగుచున్నవి. విజ్ఞులై ప్రాచీన సంప్రదాయముల నెఱింగిన పెద్దలపలుకులకుఁ బ్రాశస్త్యమే లేదు. ధర్మమందు విశ్వాసము, ఆస్తిక్యబుద్ధియు నస్తమించినవి. వర్ణాంతరవివాహములు వితంతూద్వాహములుఁ బ్రౌఢావివాహములుఁ గామచార వాదభక్షణము లెచ్చటఁ జూచినను స్వేచ్ఛగాఁ గన్పట్టుచున్నవి. అనాదినుండి కర్మభూమియని ప్రసిద్ధిఁగాంచి భక్తిజ్ఞాన వైరాగ్యములకుఁ బుట్టినిల్లైన యీభరతఖండమున కిట్టిదుర్దశ తట

స్థించుటఁజూడ వీతరాగుల మగు మాకుఁగూడ మిగులఁ బశ్చాత్తాపము గలుగుచున్నది. ... హిందూదేశము వర్ణాశ్రమాచారధర్మములకుఁ బుట్టినిల్లనియుఁ గర్మోపాసనాదులలో వన్నెకెక్కినదనియు ఖండాంతర వాసులందఱుఁ బొగడుచుండఁగా మనవారిలోనే కొందఱు (దయానంద రామమోహనప్రభృతులు) పాశ్చాత్యనాగరకతచే వ్యామోహితులై వేదముల కాభాసతాత్పర్యములఁ గల్పించి ... దుర్బోధల నొనర్చి ... సమాజముల నేర్పరచియున్నారు. ... స్వకపోల కల్పితములైన సిద్ధాంతములచే జనులను భ్రాంతిగ్రస్తులఁజేసి ... కొన్ని మతములఁ గల్పించిరి. ఇవియన్నియు ... వైదికధర్మనిర్మూలనమునకు ముఖ్యముగాఁ గంకణముఁ గట్టుకొని యున్నవి. కలిప్రాబల్యముచే నింక నెన్ని సమాజము లుద్భవింపఁబోవ నున్నవో! అయ్యో! ఇట్టి యవైదిక కుతార్కికరాద్ధాంతములచే నతిపవిత్రమై ... మను యాజ్ఞవల్క్యాది మహనీయులచేఁ బ్రతిష్ఠింపఁబడి ... నేఁటివఱకు నవిచ్ఛిన్నమై వచ్చుచున్న వైదికధర్మములు నశించుటఁజూడ నీయుగాంతమందు దుష్టశిక్షణమునకై యవతరించెదనని ప్రతిజ్ఞనొనర్చిన యా మహావిష్ణు విపుడే కల్కిరూపమున నేలయవతరించి యీసమాజములఁ దుదముట్టింపఁగూడదో యని యాతురత పొడముచున్నది. ...

నిజము పరికించినచో జాతినియమములఁ బాటింపకున్న మొదల మతతత్త్వములందు నిశ్చయసిద్ధి యెన్నటికిని గలుగదని రూఢమగుచున్నది. శ్రీమద్బాదరాయణులుకూడ జ్ఞానసిద్ధికల్గినపిమ్మటఁ గూడ నగ్నిహోత్రాదికర్మల విడువఁగూడదనియు లోకసంగ్రహార్థమైనను జేయవలెననియు నిర్ధారించి యున్నాఁడు. కనుకనే మన మతము కేవల మితరమతములవంటిది కాదు. ఇతరమతములలో జాతి భ్రష్టుఁడైనను మతతత్త్వములో సంపూర్ణనిష్ఠనొందుట కవకాశ మున్నది. ఆమతస్థు

లలో జాతికిని మతమునకును సంబంధము లేదు. మనమతమున్న నట్లు కాదు. సహజమగు జాతినియమముల ననుసరించియే మతతత్త్వములలోఁ దారతమ్యముప్రకారము సిద్ధికలుగును. లేనిచో వాఁడుభయభ్రష్టుఁడగునని శాస్త్రములు చాటుచున్నవి. అందువలన జాతినియమముల మన మెంతమాత్ర ముపేక్షింపరాదు....

ఈవిషయములో మఱియొకముఖ్యాంశము సూచింపవలసియున్నది. ... సర్వులకు సాధారణమగుజాతి నేవిధముగాఁ బాటింపవలెనో యట్లులనే యవాంతరజాతిభేదములఁగూడ నవశ్యముగా ననుసరింపవలెను. ఇయ్యవి సాంప్రదాయికములై యనువర్తించుటచే ధర్మమూలములైనవి. అవాంతరనియమములు లేకున్నచో వర్ణాశ్రమకాండము లెక్కడివి? రథకారనిషాదస్థపతీష్ట్యాదులకు జలాంజలు లివ్వవలసినదే కదా? తనజాతి యుత్కృష్టమైనను హీనమైనను విడువరాదు. కనుకనే శ్రీకృష్ణపరమాత్మ గీతాశాస్త్రమునందు

> శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్,
> స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః.

అని స్వధర్మానుష్ఠానమునకుఁ బ్రాశస్త్యమును నన్యధర్మాచరణమునకు భీతిహేతుత్వము నుపదేశించియున్నాఁడు.

మఱియొక లౌకికరహస్య మిందుఁగలదు. ...సృష్ట్యాదియందుఁ జతుర్ముఖుఁడు బ్రహ్మ క్షత్రాదిచాతుర్వర్ణ్యములను నుపజాతులను గల్పించి తత్తదనుగుణములగువృత్తుల నేర్పఱచుటలో నతఁడొక గొప్ప సంకల్పముఁ జేసియే యిట్లొనర్చెనని ప్రమాణములచే నూహింపఁదగియున్నది. నిఖిలమానవులకు నొకటేజాతి యైనచోఁ దత్ప్రయుక్తధర్మములు నందఱిచే నొకటేవిధముగా ననుష్ఠింపఁబడవలసి వచ్చును.

అప్పుడు ప్రజలలోఁ బరస్పరవివాదములు జీవికావిషయములో గొప్ప క్షోభయుఁగల్గును. అట్టియుత్పాత మొదవకుండుటకు వానివానికిఁదగిన వృత్తివిభాగ మొనర్చి సర్వులకు సమానమై పరస్పరవిఘాతుకముగాని జీవనహేతువును గల్పించి వారిబుద్ధివృత్తుల కనుగుణముగాఁ గర్మో పాసనలచేఁ బుణ్యమార్జించుటకుఁ దగినట్లు వర్ణాశ్రమధర్మము లేర్ప డుపఁబడినవి. స్వస్వజాతిప్రయుక్త ధర్మములను వారువారనుష్ఠింపనిచో దైనందిన వ్యవహారములలో నెంతటి క్షోభ కల్గుననునది యించుక యోజింపుఁడు. గంభీరముగా నాలోచించినచో నివియన్నియుఁ దత్త త్ప్రాణి బుద్ధికర్మానుసారములై సహజముగాఁ గన్పట్టుచున్నవి గాని కృత్రిమము లెన్నటికిని గావు. సహజపరిస్థితులకుఁ గాలవశమున విధిలేక మార్పులు గలిగింపఁబూనుట మహాపరాధము. ఇట్టి స్థితిలో జాతులను గాని వర్ణాశ్రమధర్మములనుగాని తిరస్కరించుట తప్పు. బ్రాహ్మణజాతి కెట్లు ధర్మ నియమములు కలవో యావిధముగా నన్యజాతులకుఁగూడ ననేక నియమములు గలవు. ప్రతివారును దమతమ నియమములఁ బాటించుచుండఁచో సర్వశ్రేయములుఁ గల్గును.

ఇవన్నియునిటుండఁ బ్రకృతము దేశములో నొక గొప్పసమస్య కలదు. ఈసమస్యను గల్పించినవా రెవరైనను దత్ఫలముమాత్రము మన దేశమున కెక్కుడు నష్టమును గల్గించుచున్నది. ... కొందఱు బ్రహ్మద్వేషములతో మెలఁగుచున్నారు. అట్టివారియెడ శ్రీవిద్యాశంక రుఁడు తనదివ్యదృష్టి నెఱపి యాభేదబుద్ధులఁ బోఁగొట్టుఁగాకయని యాశించుచున్నాము.

బ్రాహ్మణు లెన్నటికిని బ్రాహ్మణేతరుల హక్కులఁ బోఁగొట్ట లేదు. ప్రతిప్రాణియొక్క యభివృద్ధియుఁ దమతమ సహజములగు

శారీర మానస వ్యావహారిక వైజ్ఞానికాది శక్తులపై నాధారపడియుం
డును. వానినెవ్వరుగాని యొకరికొక రడ్డగించుటకు వీలుండదు.
బ్రాహ్మణులు తాత్త్వికమగు విజ్ఞానశక్తుల గ్రహించి, వ్యావహారిక
మానస శారీరాది శక్తులను బ్రజాపాలన కృషి వాణిజ్యాదివృత్తులను
బ్రాహ్మణేతరుల కొసంగిరి. పై శక్తులలోఁ బరస్పరసంబంధమే లేదు.
ఇఁక విరోధమనుమాట మిక్కిలిదూరము. రెండుశక్తుల నొకఁడు సమ
ర్థించుకొనుట శ్రమావహముగాన సోదరభావముగల్గియున్న బ్రాహ్మణ
బ్రాహ్మణేతరులు పైరీతిగ వృత్తిశక్తి విభాగముఁ జేసికొనిరి గాని
వేఱుకాదు. ఇందుఁ బక్షపాత మేమికలదో తెలియకున్నది. అట్లు
పక్షపాతముతో స్వార్థపరులై బ్రాహ్మణులు వర్తించియున్నచోఁ
జాణక్యాది మహామేధాసంపన్నులు తమప్రతిజ్ఞలోఁగడతేరి పిమ్మట
నేల చంద్రగుప్తాదులనే రాజ్యపరిపాలనలో నియమింతురు? మఱియు
బ్రాహ్మణజాతికి విధించియుండుధర్మములు నియమములు నొకక్షణ
కాలమైన నీబ్రాహ్మణేతరులు పాటింపఁ జాలుదురా? వేయేల?
బ్రాహ్మణుఁడు స్వార్థపరుఁడై యితరజాతులకన్న నెక్కుడు సుఖ
వృత్తినే యపేక్షించుచో భిక్షాటన సన్న్యసన వనప్రస్థానాదుల నేల
తనకువిధించుకొనును? క్షత్రియ వైశ్యాదులచేఁ బాటింపఁబడు ప్రజా
పాలన వాణిజ్యాదులలో నైహికసౌఖ్యమధికముగా నున్నను బ్రాహ్మ
ణుఁడుకోరుచున్నాఁడా? తత్త్వజ్ఞానశక్తి క్షీణించిన యీదినములలోఁ
గూడ సాధ్యమగు నంతమట్టుకు విజ్ఞానముచేతనే యతఁడు తనజీవికను
గడపుచున్నాఁడు కాని యన్యముగా లేదు. కనుక ననాదిసిద్ధములగు
జాతులలోఁ బరస్పర మసూయాదు లెన్నటికి నుంచుకొనరాదు. ఈవిష
యమై బ్రాహ్మణులు మిక్కిలిశ్రద్ధవహించి దేశశాంతికై యత్నింప
వలెను. మఱియు బ్రాహ్మణునికి విజ్ఞానశక్తి యెక్కువగానున్నదనుచో
క్షత్రజాతికిఁ బరాక్రమ పరిపాలనాశక్తు లధికములు కావా? వైశ్య

లకు ధనసంపత్తియు శూద్రులకు ధాన్యసంపత్తియు నెక్కుడుగా నుండలేదా ? కనుక నందఱును జేదోడు వాదోడుగాఁ గలిసిమెలసి ధర్మనిర్వహణ మొనర్చుటయే ప్రకృతము హితమైనది. లేనిచో నన్య దేశీయులద్వారమున మన వైదికధర్మములు నిర్మూలితములై నామ మాత్రావశిష్టములగును. ...

బ్రాహ్మణ బ్రాహ్మణేతర సంక్షోభ మటుండ నంతకన్న నెక్కువయగు మఱొకసమస్య వ్యాపించియున్నది. అది .. యగ్ర నిమ్నజాతి తారతమ్య నిర్మూలనమే. ఈప్రచారముచే నెవరి కెట్టి కష్టము లంతగా సంభవింపకున్నను మహాప్రభావోపేతములగు దేవస్థానములకే పతనదశ వాటిల్లినది. పై సమస్యవిషయమై వివరించు టకుఁ బూర్వ మొక చిన్నయంశము బోధింపవలసి యున్నది.... ప్రపంచములోని చరాచరప్రాణికోటు లెల్ల నేకస్వభావముతో నెన్నటికి నుండఁజాలవనుట సుప్రసిద్ధము. ప్రతివస్తువునందు నుత్తమ మధ్య మాధమభేదము లుండియే తీరును. అట్లెందుకుండవలెనని యాక్షేపించినచో దానికి సమాధాన మీశ్వరుఁడే చెప్పఁదగు. ఇట్లుండ నిమ్నజాతులకు (చండాలాదులకు) హీనపరిస్థితి యెట్లువచ్చిన దన్నచో, నది వారికర్మాధీన మనియే చెప్పనగునుగాని వేఱుకాదు. దేశములో ననేక సుఖదుఃఖతారతమ్యములతో నుండు ప్రజలు తమ ప్రభువును జూచి " ఇతని కింతయైశ్వర్య మెందుకువచ్చినది. ? మనకు మాత్ర మేల యిట్టిదుర్దశ తటస్థించిన " దని సత్యాగ్రహముఁబూ నుట యెట్టివెఱ్ఱితనమో యిదియు నట్లెయగు. ఇట్లాక్షేపించువారు పిపీ లికాది బ్రహ్మపర్యన్తప్రాణులకుండు తారతమ్యమును గన్గొని యాకా రణరూపుఁడగు పరమాత్మకుఁగూడ వైషమ్య నైర్ఘృణ్యముల నారో పింపఁ గల్గుదురు. మనదేశము మాట యటుండనిండు. అన్యదేశములలో మాత్ర మిట్టి తారతమ్యములఁ బాటించుట లేదా ? ఇండియాలోఁ

బుట్టినంతమాత్రముననే యాంగ్లేయునకు హీనజాతిత్వము గల్పించుట మీరు వినుచుండుట లేదా ? అన్నియు నిప్పటి దేశనాయకంమన్యులకు గోచరించుట కష్టము. ఇట్లుపలుకుటచే నానిమ్నజాతులకుఁ బరమార్థదృష్టి జ్ఞానవృద్ధి యనవసరమని మేము భావింపము. ఉచితమగు విద్య నభ్యసింపఁజేసి వ్యవహారాభిముఖులఁ జేయుట యావశ్యకము. అంతియకాని యగ్రజాతులతోఁ జేతులు కల్పుకొని మెలఁగినమాత్రమునఁ దమకు స్వధర్మ భ్రష్టతయే కాని యెట్టిలాభ ముండదనియే ముఖ్యాంశము. ... మఱియు దేశములో పైఁజెప్పినవారిలోనే మఱొక యతృప్తికూడఁగలదు. ఏమనఁగా, "హిందూజాతిలో నగ్రవర్ణముల వారు మహమ్మదీయ క్రైస్తవాద్యన్యమతములకుఁ జేరినవారితోఁ గలసియుండుటకు సమ్మతింతురు. తమజాతికి మతమునకును జేరిన నిమ్నజాతులనుమాత్రము మిక్కిలి బహిష్కరింతురు. ఇదియొక మహాపరాధముగా నున్నద" నుటయే. ఇవ్విషయము కేవలము ధర్మసూక్ష్మము. నాగరిక... బుద్ధులకుఁ దోఁచునట్టిదికాదు. ఎవని కేమతనియమములందు విశ్వాసముండునో వాని కద్దాని నుండియే ఫలము కల్గును. జన్మాంతరమును గర్మసంస్కారములను నొప్పుకొనిన హిందూమతము ప్రకారము హీనకులజుఁ డగువాఁడు పూర్వజన్మమున నేదియో దుష్కర్మమాచరించియుండునని యూహింపవలసియుండును. అట్టివానిని బహిష్కరించుట వాని నధోగతికిఁ బాలొనర్చుటకుఁగాదు. పశ్చాత్తాపబుద్ధిగల్గి సత్కార్యములచే నున్నతదశకు రావలెననియే. ...

మఱియు వర్ణాశ్రమాది ధర్మములఁ బాటించుచుండు హిందూమతమునం దుండువఱ కెట్టివానికైన నియమము లుండును. అద్దాని విడిచి యితరమతములలోఁ జేరినచో వానికిఁ గ్రొత్తమతముల విశ్వాసప్రకారము ఫలము కల్గును ... అట్టివాని యెడ స్పృశ్యాస్పృశ్య వివక్షచేయ నవసరములేదు. హిందూమతధర్మ శాస్త్రములును విధి

నిషేధములును స్వకీయునకే కాని పరమతస్థుని శాసింపఁ జాలవు. హిందూమతాభిమానులకును దదభిమాన వర్జితులగు హిందూమత ప్రతిపక్ష మతస్థులకును విశేష వ్యత్యాసము కలదు. ...

అది యటుండనిండు. సభ్యులారా! ... కల్పాదినుంచి నేటివఱకుఁ బవిత్రతమములై వెలయుచుండు వేదశాస్త్రముల రక్షింపవలసిన బాధ్యత హిందూజాతి సామాన్యమున కున్నను నిక్కాలమున నయ్యది బ్రాహ్మణజాతి మాత్రముననే విశ్రాన్తమయి యున్నది. అధ్యయన సంప్రదాయములు నేటికిని బ్రాహ్మణసంతతిలోనే యవిచ్ఛిన్నముగాఁ బ్రవర్తించుచున్నవి. ఇట్టితఱి నీబ్రాహ్మణులలోఁ గొందఱు విదేశీయనాగరకతకు వ్యాముగ్ధచిత్తులై వేదశాస్త్రములఁ దూలనాడుట విపరీతవాదములఁ జేయుచుండుట యుక్తముకాదు. వారి కుభయభ్రష్టత సిద్ధించునే యని చింతిలుచున్నాము ఎట్లైన వేదశాస్త్రములరక్షించి, ధర్మదేవత కాశ్రయముగల్పించుట బ్రాహ్మణులచేతిలోనున్నది. ప్రకృతస్థితుల ననుసరించి యెట్టివ్యవహారవిద్యల నభ్యసించినను నుచితమగు పద్ధతితో వేదశాస్త్రాధ్యయనములఁ జేయుట తప్పనిసరియని మఱిమఱి హెచ్చరించుచున్నాము. ...

"ధర్మశాస్త్రములలో బ్రాహ్మణులు తమకు శ్రేష్ఠత్వము నిరూపించుకొని యితరజాతులకు హీనత్వముఁజూపిరి. ఇట్టిపక్షపాతము ధర్మప్రతిపాదకములగు శాస్త్రములలో నుండరాదు" అని కొందఱాక్షేపింతురు. ఇది యవిచారితరమణీయము ధర్మశాస్త్రము లాయాజాతుల కుత్కర్షాపకర్షములను వ్యవహారములో నిరూపించినవి కాని పారమార్థికమునకుఁ గాదు. దానిచే వారికెట్టి న్యూనతయుఁ గలుగదు. "శునిచైవ శ్వపాకేచ పండితా స్సమదర్శినః" అను శ్రీకృష్ణపరమాత్మ గీతామృతమును గ్రోలిన మహనీయులకును శ్రీశంకరభగవ

త్మ్యాదుల "మనీషాపంచక" మును బఠించిన ముముక్షువులకును నివిషయ మతివిశదముగాఁ దెలియఁగలదు. మేము వెనుకఁజెప్పినరీతిగా నుత్తములతో సంవ్యవహారమును నుత్తమస్థలములలోఁ బ్రవేశమును లేకపోయెఁగదా యను పశ్చాత్తాపమే వారి నుద్ధరింపఁజాలునను సదుద్దేశముతో ధర్మశాస్త్రములం దట్టివారియెడ విశేషించి నిందార్థవాదము లున్నవి కాని వేఱులేదు. ఇట్టి పవిత్రోద్దేశ ముండినపుడు వానిని నిరాకరించుట సరికాదు. ఇవ్విషయములోఁ బ్రకృతము కొంత మట్టుకుఁ గలహములు జరుగుచున్నవి. బ్రాహ్మణులందఱును బ్రాణమాన ధనముల ధారవోసియైన ధర్మశాస్త్ర నియమములఁ గాపాడుదురుగాక. ... మఱియుఁ బ్రకృతరాజకీయ పరిస్థితుల నాలోచింపఁగా బ్రాహ్మణజాతి కేమియు నాశ్రయ మగుపడుట లేదు. రాజ్యాంగము వారు కేవలము తమ తృతీయోపాయము నుపయోగించి మిగులఁ జమత్కారముతో రాజ్యభారమును నిర్వహించుచున్నారు. తమరాజనీతికి ఫలితరూపమగు మాయాజాలములోఁ జిక్కుపడువారిలో నీద్విజులే మొదటివారని వారియభిప్రాయము. మనవారియందుఁ జిత్తస్థైర్యముఁ గార్యదీక్షయు నానాటికి నశించిపోవుచున్నది. పరస్పరాసహనబుద్ధి మెండైనది. అందువల్లఁ బ్రభుత్వమువా రీ బ్రాహ్మణజాతిని లెక్కించుటయే లేదు. వీరిలో నైకమత్యము తక్కువ. ఒకఁడు వద్దనిన పనిని మఱొకఁడు శ్రద్ధతోఁ జేయఁబూనును. ఇట్లు భిన్నాభిప్రాయములతో వీరిని వర్తింపఁజేసి ప్రభుత్వము తటస్థభావము వహించియుండును. ఇది యుక్తముగఁ దోఁచుట లేదు. వర్ణాశ్రమధర్మముల ననుసరించి జాతిమతసాంకర్యమునకెడమీక ప్రజలఁబరిపాలించుట యెట్టి ప్రభుత్వమునకైనఁ దప్పనివిధియయి యున్నది. సాధ్యముగా జాతిమతాదుల వీలగుచో రక్షించుట లేనిచో నాసయెడఁ దటస్థత వహించియుండుటయు మిక్కిలి శ్రేయస్కరమని తలంచుచున్నాము....

నిజమును బరికించినచోఁ బ్రభుత్వమువారియొడ మిక్కిలితప్పు కానఁబడదు. ఎట్టికార్యములైన నడచుటకై కొన్ని రంగస్థలము లేర్పడి యున్నవి. అయిన నవి నిజముగా సదుద్దేశములతో నేర్పడినవికాని రానురాను వానికి విపరీత పరిణామములు కల్గినవి. అవి యేవనఁగా శాసనసభలు, వీనిలో సభ్యుఁడగుటకు జాతికులగోత్ర విద్యావయస్సులుకాని మఱియే యితరగుణములుకాని ప్రకృతము సాధకములుగా లెక్కింపఁబడుటలేదు. పుష్కలధనముకాని లోకములో నొక విధమైన పలుకుబడిగాని యున్నఁజాలును. ఇట్టివా రేస్వల్పసంఖ్యాకులో (అనగా పదులుమాత్రమే) అనేక కోట్లసంఖ్యగల ప్రజలకుఁ బ్రాతినిధ్యము వహించుట! వీరిచర్యలలో వ్యావహారిక విషయములం దింతవఱ కెన్నిలోపములు జరుగుచున్నను గొంతమట్టు కుదాసీనత వహించినను బాధకము లేకుండెను. ఇపుడట్టిటుపోరలి ధార్మికములలోఁబ్రవేశించి యీసభ లోట్లనిచ్చినవారియొక్కయు నీనివారియొక్కయు నింటికడపల దాఁటిలోనఁబ్రవేశించినవి. అంత సంకోచించి చెప్ప నేల? పడకటిండ్లలోనికేగి పట్టెమంచములపై నెక్కినవనియే చెప్పనగు. ఎట్టియన్యాయము! ఎంతటి దురంతము! విరక్తులగు మేమీవిషయములలో జోక్యము కలుగఁజేసికొనుట యేలయని యుదాసీనతఁ జూపి యుండవలసి యున్నను ధర్మపీఠము నధిరోహించి యుండుటచే నింత పశ్చాత్తాప మొందవలసియున్నది. ఈశాసనసభలలోఁ గేవలము రాజ్యతంత్రములు తప్ప నితర విషయములలోఁ జర్చలు సల్పుట సర్వధాయసంగతము. హిందూమత సంప్రదాయముల నించుకైన నెఱుఁగని యీసభ్యులలో నధికసంఖ్యాకులు గలసి జాతిమత శాసనముల నొనర్చుట యెంతటి పాపహేతువో వీరికిఁ దెలియకున్నది. ఇటీవల నమలులోనికి వచ్చి దేశమంతటను మహాక్షోభలకాకరమై యుండునట్టి శారదా శాసనము పుట్టుపూర్వోత్తరముల విచారించినచో నింతటి క్రూరకార్యములు

జరగుచున్నను బీభత్సమువాఁ వీనినిమాన్పఁబ్రయత్నించుటకు బదులుగాఁ దాటస్థ్యమైన వహింపకుండ వీనికిఁ దోడ్పడుటఁజూడ నెంతయు విషాదకరముగా నున్నది. కనుక నీశాసనసభలు నేటికి దేశక్షోభకే యుపయోగించుచున్నవి. ఇఁకమీఁదనైన నిట్టి యవివేకములు కలుగకుండఁ జూచుకొనుచుఁ జేసిన యాభాసమును దిద్దికొని తమకిచ్చియుండు పెత్తనమును మాత్రము దక్కించుకొనుదురుగాక యని మీరందఱు వారిని హెచ్చరింపవలసి యున్నది....

ఈ శాసనసభల నూఁతకఱ్ఱగా నుంచికొని యాధునిక సంస్కర్తలు విజృంభించు చున్నారు. వీరికోలాహలములు మెండయినవి. వీరియెడ గొప్పదాటుతప్ప మఱేమియుఁ గన్పింపకున్నది. ఇంగ్లీషువారి పోకడల ననుసరించి నడవవలెననుశ్రద్ధ భోగవాంఛ నియమరాహిత్యము మున్నగు సాధనసంపత్తియే వీరికి ముందుకుఁ దెచ్చుచున్నది. వెనుకఁజెప్పిన యవైదిక సమాజములు వీరి వాదాభాసములు స్థిరపడుటకు ముఖ్యాలిపీటలవలె నున్నవి. వీరుచెప్పు హేతువాదములుకూడఁ గేవలమాభాసములే కాని వేఱుకాదు. తుదకు వీరియత్నములన్నియు మహాప్రయత్నముచే మునుపు భట్టకుమారిల శ్రీశంకర ప్రభృతులచే నిర్మూలింపఁబడిన మాధ్యమిక మతమునకు మరల బీజవాపన మొనర్చుట కేమోయని తోచుచున్నది. స్వభావములు మిక్కిలి విపరీతించినవి.

"అవిద్యాయా మంతరే వర్తమానాః
స్వయం ధీరాః పండితంమన్యమానాః
దంద్రమ్యమాణాః పరియన్తి మూఢాః
అంధేనైవ నీయమానా యథాంధాః"

అను శ్రుతివాక్యమునకు వీరు లక్ష్యభూతులగుచున్నారు. ఏమి చేయుదము ! మీరందఱునడికట్టు బిగించి కార్యరంగముఁబ్రవేశించిన

నేకాని వీరియుద్యమము లడుగంటఁజాలవు. వేదశాస్త్రములు రక్షింపఁ బడఁజాలవు....

పై వారి రాద్ధాంతములకు శాసనసభలుకాక స్వరాజ్యకక్షివారు ...ప్రోద్బలకులై యున్నారు. దేశక్షేమమునకయి వీరు చేయు నుద్యమము లన్నియు నతిపవిత్రములయినవి. విరక్తులై సర్వసామ్యదృష్టిని వహించియున్న మాబోంట్లకుఁ గూడ వీరు శ్లాఘాపాత్రులయి యున్నారు. అయిన నిటీవల వీరు తమకనావశ్యకములగు సాంఘికపరిస్థితులలో నిష్కారణముగా జోక్యము కలుగఁజేసికొని బహుజనులకు మనోవ్యధ కలిగించుచున్నారు. వీరిని దూషించుటకుఁగాని భూషించుటకుఁగాని వీలుకాకున్నది. వేదశాస్త్రవిధులను జాతిమత వర్ణాశ్రమధర్మ కర్మ నియమముల నుల్లంఘింప నముకట్టిన పిదప వీరిమహాసభకు దేశీయత యెట్లుఘటించునో వీరికే గోచరముకాకున్నది. అహింసావ్రతమని వీరందురుకాని జాతీయ సాంఘిక ద్వైవిక విషయములలో ననేకులకు వ్యథలఁ గల్పించిన వీరియుద్యమమున కేల హింసయే ఫలముకాదు? ఇప్పటికైనను సాంఘికద్వైవికములందు జోక్యముపుచ్చుకొనమని వీరు ప్రమాణము చేసిననే కాని సనాతన ధర్మాభిమానముగల యెల్లరును వారియుద్యమములోఁ గలియరాదని మీకు నేను హెచ్చరికఁ జేయుచున్నాను ...

ముఖ్యముగా బ్రిటీషువారి శాసనసభలు దేశీయసభలు నేవి యెట్లు విపరీతచర్యలఁ జేయుచున్నను స్వదేశసంస్థానములవారు మాత్రము హిందూవైదికధర్మ రక్షణమం దతిశ్రద్ధవహించియే తీరవలెను. లేనిచో వారి రాజ్యములకు స్వదేశీయతయే సార్థకముకాదు. పైవిషయములో నచటి ప్రజలందఱు మిక్కిలి శ్రద్ధవహించి యచ్చటనయిన ధర్మ రక్షణమునకయి పాటుపడుదురుగాక. ఎవరెట్లు చరించినను వారికి మాత్రము వైదికధర్మరక్షణ బాధ్యత యెన్నటికిని దప్పదు ...

మఱొక విచిత్రవిషయము కలదు ఏమనఁగా - పైసంస్కర్తలు మొదలగు వారందఱును స్వాభిప్రాయములకుఁ దగినట్లు దేశమందంతటను నభిప్రాయమున్న దనుటకయి యమాయకురాండ్రగు కొందఱ స్త్రీలను బాశ్చాత్యవిద్యావతులుగా నొనర్చి వారిద్వారమునఁ గపట సంస్కరణ నాటకమును నలుదిక్కుల నాడించుచున్నారు. నిజముగాఁ బాపమీయాడువారికి కర్తవ్యాకర్తవ్యములు దెలియవు. సంస్కర్తల మాటల విని తామువెలంగినచోఁ దుదకిహపరములకు రెంటికిఁ జెడుదురు. ప్రౌఢావివాహ వితంతూద్వాహ స్త్రీ స్వాతంత్ర్య జాతిసామ్యాదివాద ప్రతివాదము లన్నియుఁ దమ చెరుపునకే కాని వేఱు లేదు. అట్టితఱి నెన్ని యవినీతులు జరుగునో దైవమునకే గోచరము - వీని విషయమై వివరింపఁబోవుచో నెక్కుడు కలదు. వైదికధర్మముల దూషించుట శిష్టులగు గృహిణులఁ దూలనాడుట సంస్కరణములపై శ్రద్ధఁబూనుట మున్నగునవి వీరికిఁదగవు. ఇకఁమీఁదనయిన వీరీ భావమధురములగు నుద్యమముల మానుకొని సదాచారరతలై దేశమునకుఁగీర్తిఁ దెత్తురుగాక. ముఖ్యముగా వీరు భగవద్గీతలోని అర్జున విషాదయోగా ధ్యాయమందలి "స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ!" మున్నగు వచనముల నొకతూరి విలోకింతురుగాక. మనమతము కేవలము హేతువాదములకు మాత్రము లోఁబడినదికాదు. కనుకనే యితరులవలె విచ్చలవిడిగాఁ జరించుటకు వీలుండదు ...

వీరందఱీరీతిగ స్వాభిప్రాయములను సంపూర్ణ దేశాభిప్రాయములని వెల్లడిచేయుటవల్లనే ధర్మవృత్తమునకు మూలతుల్యమగు బాల్యవివాహమునకే నిషేధశాసన మేతెంచెను. నిజముగా నిది యమలులోనికి వచ్చుటచేఁ గలిపురుషుని సంపూర్ణావతార మీయుగములో నయినదని చెప్పవచ్చును. వైదికవంశములకు నిషియంపి యున

నేల భరతఖండమున కంతటికిని దుర్దశ వాటిల్లినది. ఈవిషయమై పిష్ట పేషణతుల్యముగా నెక్కువ వివరించుటలో నుపయోగము లేదు. ఇటీవల సిద్ధానికిఁ గొంత మట్టుకు సవరణమైనఁ గలిగి దేశశాంతికి హేతువగునని యనేకులు నిరీక్షించియుండఁగా నదియు గగనకుసుమమాయెను. అందఱును గార్యదీక్షవహించి ధర్మోద్ధరణమునకుఁ గడంగవలయును. శ్రీగవర్నమెంటువారిని నన్నివిధముల వేడుకొని శాసనము రద్దుపరచుకొను ప్రయత్నములు త్వరితగతితోఁ జేయవలయును. లేనిచో నతి శీఘ్రకాలములోనే ధర్మదేవత భారతభూమిలో నామమాత్రావశిష్ట యగును. ...

పై కార్యభాగము లన్నియుఁ బ్రచురముచేతనే సాధ్యములు. మనకేమియను నుదాసీనత వహింపక ప్రతివారును దమ కిది తప్పని పనియనితలఁచి ధర్మప్రచారము గావించి జనులను బూర్వాచారములందు విశ్వాసము కల వారినిగాఁ జేయవలెను. ధర్మసభల స్థాపించి తన్మూలముగా రాజ్యాంగమువారిని మతవిషయములోఁ దాటస్థ్యము వహింపుఁడనుసంగతిని మఱిమఱి తెల్పవలెను. ఇట్టితఱి శక్తికిమీఱిన పనికి మీరందఱు చేయవలెను. వైదికధర్మముల నిలుపుబాధ్యత కేవలము మీపైననే యున్నది. ... సభ్యులారా! పైవిషయములకు సంబంధించిన యంశము లనేకములు కలవు. అవన్నియుఁ జాలమట్టుకు వ్యావహారికమార్గములలో నెక్కుడుప్రవర్తించుమీకు మాకంటె నధికముగాఁ దెలిసియుండుననియే భావించెదము. విశేషించి వివరించుటకన్న కార్యరూపమున నద్దానిని జూపుట యుక్తము. ఐకమత్యముతో మీరందఱుఁగలసి ధర్మమునకుఁ దటస్థించియుండు హీనదశలఁదొలఁగించి సంపూర్ణకళల నొందింతురుగాత.

ఇట్టి మహాసమ్మేళనముద్వారమున ధర్మప్రచారము గావింపఁ దలఁచి మాయధ్యక్షతఁగోరినందున కీహితవచనములఁ నుడివి మీసదుద్యమము లెల్లపుడును నిర్విఘ్నముగా నెరవేరుగాకయని యాశీర్వదించుచు శ్రీవిద్యాశంకర శ్రీవిరూపాక్షమూర్తులఁ బ్రార్థించి నారాయణ స్మరణ మొనర్చుచున్నాము.

శాసనోల్లంఘనోద్యమము

భారతధర్మాభివృద్ధికి భయంకరము.

ప్రభుత్వమువారి కొక హితోపదేశము.

కొన్ని చోట్ల నిరపరాధులను ఘోరముగఁ జంపుటకిందఁ బరిగణించిన ప్రభుత్వమువారి కఠినచర్యల నొకవంక నిరసించుచు గాంధిగారి యిటీవలి శాసనోల్లంఘనోద్యమమువలని యపాయములను గుఱించి దేశీయులకుఁ బ్రబోధించుట మావిధియని తలంచుచున్నాము. ప్రథమమున శాసనోల్లంఘనమనునది వ్యక్తులచేఁ జేయఁబడినను నయ్యది భయంకరనాశన సాధనము. అది యితరవిధముల నివారింపరాని యేదైన నొక ప్రత్యక్షమగు నన్యాయమును దొలఁగించుటకై నుపయోగింపఁబడినపుడే నైతికముగ సమర్థనీయము. గాంధిగారి ప్రస్తుతోద్యమమిండియాలోని ప్రస్తుత ప్రభుత్వమును గూలఁద్రోయుటయను కార్యము కొఱకేగాని దానిస్థానమున నుంచుట కంతకంటె మంచిది సిద్ధముగా

నుండలేదు. అదిగాక యీ ప్రభుత్వవిధాన మిప్పుడు పరిణామ దశలో నున్నది. ఇంతకంటె మంచిదేర్పఱచుటకుఁ గష్టతరమగు కార్యము కావలసియున్నది. రెండవది సమష్టిశాసనోల్లంఘన మెంత జాగ్రత్తగ నడుపఁబడినను గొన్నిచోట్ల నింతవఱకు జరిగినట్లే హింసాయుతము కాక మానదు. ఉద్యమము సాగినకొలదియు దుకాణములకడఁ బికెట్టింగును రాళ్ళురువ్వుట మొదలగు ప్రజాసామాన్య కార్యములకు స్వాధికార భంగభీరువులగు ప్రభుత్వమువారు లాటీలతోను దుపాకులతోను జవాబు చెప్పకమానరు. మద్రాసులో నిదివఱకు జరిగియున్న విధమున రక్తపాతము సంభవించినచో నపరాధులతోపాటు నిరపరాధులును నిష్కారణముగ హింసలకును మరణములకును పాల్పడుట కుత్తరవాదులు తొలుదొలుత కలహకారణులైన సత్యాగ్రహనాయకులు కాకతప్పదు. వీరిటీవలఁ జేసిన కార్యములలో నొకటియగు తాళవృక్షచ్ఛేదనము మహాపాపమని మేము ప్రత్యేకముగా నిరసించుచున్నాము. దురదృష్టవశమునఁ గొంతమందిచే దుర్వినియోగము చేయఁబడుచున్నను దాళవృక్షమార్థికముగ ననేక కష్టజీవుల నివాసములకుఁ బైకప్పులను సమకూర్చుచుండుటచే భారతదేశప్రజలకుఁ గామధేను వనఁదగియున్నది. మనుష్యభాషలో నెట్లుచూచినను సత్యాగ్రహ మనిపించుకొనఁజాలని తాళవృక్షచ్ఛేదనమను నీభయంకరాధర్మమునుగూర్చి యే హిందువు పరితపింపకుండ నుండును? మూడవది పాశ్చాత్య దేశములోఁ బ్రస్తుతము జరుగుచున్నట్లు ప్రజాసామాన్యముపైఁ గొద్దిమంది మధ్యతరగతి నాయకుల దౌర్జన్యమునకును నల్పసంఖ్యజాతులమీఁదను వారి యాశయములమీఁదను నధిక సంఖ్యాకుల దౌర్జన్యమునకును బూర్వాచారపరాయణులపయి నవీనాచారపరాయణుల దౌర్జన్యమునకు నెడమీయని ప్రజాప్రతినిధ్యపూర్వక ప్రభుత్వవిధానమును మన మేర్పాటు చేయవలసియున్నది. గాంధిగారికడ నట్టినిర్మాణ

విధానమేదయిన సిద్ధముగనున్నదా? లేకదానిని సమష్టిశాసనోల్లంఘనము ద్వారమున సంపాదింపవచ్చునని యెవరయిన నమ్ముచున్నారా?

అట్లైన నింతమంది విద్యార్థులేల యీ యుద్యమములో దుముకుచున్నారని ప్రశ్నింపవచ్చును. దీనికి బ్రత్యుత్తరము సులభము. దేశమందంతటను బిస్తృత ప్రభుత్వవిధానముపై విద్యార్థులగు భారతీయులకుఁగలిగిన యసంతృప్తియే దీనికిఁగారణము. అందుచే సమష్టిశాసనోల్లంఘనముయొక్క యపాయములనుగూర్చి యొకవంక దేశీయులను బ్రబోధించుచు భారతీయులకుఁ గలిగిన న్యాయమైన కోరికలను దీర్చుపట్ల నిఁక నొకక్షణమైన నాలసింపరాదని ప్రభుత్వమువారిని మందలించుచున్నాము.

జన్మభూమి యెడల భక్తిలోఁగాని సంఖ్యచేనయినను శక్తిచేనయినను బలహీనుఁడగువారిని బలవంతులు దౌర్జన్యమునకు లొంగునట్లుచేయుని స్వరాజ్యమును గాంక్షించుటలోఁగాని మేమెవరికిని దీసిపోము. కాని యట్టిభక్తికాంక్షలచేతనే మనపూర్వధర్మము నెడలను వర్ణాశ్రమవిధానము నెడలను ద్వేషాసహనములు విస్పష్టముగాఁ గలిగియుండువారిచే నేర్పాటుచేయఁబడిన యొట్టిశాసనోల్లంఘనోద్యమము వలనను నట్టిపిక్కనుగు స్వరాజ్యము సిద్ధింపఁజాలదని సూచింపవలసి వచ్చినది. మనపూర్వధర్మవిజ్ఞానమును నశింపఁజేయఁ గారణమగు స్వరాజ్యము కొఱకుఁగాని స్వాతంత్ర్యము కొఱకుఁగాని నడుపఁబడు నెట్టియుద్యమమునందును మేము పాల్గొనఁజాలము.

యం. కె. ఆచార్య, యమ్. యల్. ఏ. చెన్నపురి.
యన్. యల్. దొరై, తిరుచినాపల్లి.
టి. కె. బాలసుబ్రహ్మణ్య అయ్యరు. కుంభకోణము.
దివాన్ బహద్దర్. వి. కె. రామానుజాచారి యార్,
కుంభకోణము.

క్రొత్తసంవత్సరము 1930-1931

ప్రమోదూత సంవత్సరమునకు ... గ్రహములు ... దుర్బలములై యుండుటచేతను సకలశుభంబుల నందఁజేయు దేవగురువును శుక్రుఁడును ప్రముఖ నాయకత్వములను వహింపని కారణమును బట్టియు ... ద్వాదశ భావములును బలహీనత చెందియుండుటచేతను నెండవేడిమి యెక్కువగా నుండును; ఖండవృష్టి కలుగును. సస్యములు నష్టమగును. వ్యవసాయము చేయువారికిని, భూమికామందులకును నుత్సాహము తగ్గును. జనులు కష్టముల పాలగుదురు. జీవయాత్ర గడుపుకొనుట కష్టతరమై కానిపించును. దారిద్ర్యము వ్యాపించియుండును. పాఠశాలలకును శిశువులకును నుపద్రవములు కలుగును. అగ్ని ప్రమాదములు కలుగును. చెఱసాలలయందును నాసుపత్రులయందును గార్యాలయముల యందును మరణసంఖ్య యధికమగును. అన్యదేశములతోడి వ్యాపారమున కిబ్బందులు కలిగి మనస్సర్థలకుఁ గారణమగును. నాటకములును నుత్సాహ ప్రదర్శనములును వృద్ధి గాంచవు. ధరలు వృద్ధిక్షయములకు లోనగును; బ్యాంకులు నష్టముల పాలగును, న్యాయస్థానములయందుఁ గ్రొత్తవిధమైన నేరములు విచారణకువచ్చును. ఇనుపదారులు మోటారులు మొదలగువాని యజమానులకును బనివారలకును నతృప్తివాటిల్లును. పనులు నిలిచిపోవుటనుగుఱించి కొన్నియనుకూలతలును దటస్థపడును.

నౌకాసంబంధమును మత విషయముల సంబంధమును గల నవమభావమందుఁ గుజుఁడుండి శనిచేతఁజూడఁబడినందున నోడలకపాయము సంభవించును. మతవిషయములయం దుద్రేకములు కలుగును. వ్యయస్థానమును భూమినందనుఁడు చూచుటచేత చెఱసాలల

యం దవిధేయత ప్రారంభమగును గాని భావమందు గురు వుండుట వలన శుభత్వమును బట్టియున్నదిగావునఁ గొన్ని యనుకూలమయిన మార్పులు చేయఁబడును. పంచమ స్థానమునఁ గేతువుండఁగా భావాధిపతి శుక్రుండు పాపగ్రహ మధ్యగతుఁడయి యుండుటచేత రాజవంశములయందుఁగాని తత్సమానౌన్నత్యము వహించిన వారలయందుఁగాని యొకరిద్దఱు మరణమొందుదురు. ...వివాహ శాసనముల మీఁదఁ జర్చలు బైలువెడలును. శాస్త్ర విరోధమైన వివాహములు జరుగును. స్త్రీలు విజృంభించి స్వేచ్ఛానువర్తినులయి మెలంగుదురు. కుటుంబచ్ఛిద్రములు బట్టబయలగును. రాజ్యస్థానమును నందున్న రవియును కుజరాహువుల మధ్యనుండుటచేతను భావాధిపతియగు గురువు బలహీనుండయి వ్యయస్థానమునుండి యుద్ధకారకుఁడగు కుజునిచేతఁ జూడఁబడినందునను యుద్ధము సంభవించుటకుఁ జాలినంత యవకాశమున్నది. కన్యారాశిని రవి చంద్ర కుజ బుధ గురు శుక్ర శను లేడ్వురును జూచుటచేతను కుంభ మేష రాసులలోఁ గుజుఁడుండుట చేతను లగ్నసప్తమ స్థానములగు మిథున ధనుస్సులకుఁ బాపగ్రహ దృగ్యోగాదులు గలిగి, శుభగ్రహదృగ్యోగాదులు ఘట్టకుండుటచేతను డర్కీ గ్రీస్ మెసపటోమియా వెస్టిండీస్, అరేబియా పిటిరియా ప్రష్యా పోలెండు రష్యా యింగ్లండు ప్రాన్సు జర్మనీ మొదలుగాఁగల దేశములు యుద్ధమునందుఁ బాల్గొనును....

మకరరాశి కిరుప్రక్కలను గుజశనులు చేరియుండుటచేత నాఫ్గనిస్టాన్ పర్షియా యిటలీ మొదలుగాఁగల దేశము లుపద్రవరహితములయి యుండఁజాలవు. ఇండియా దేశము రాజతంత్ర వ్యవహారకష్టములకు లోనగును. ప్రజలకుఁ బ్రభుత్వము వారియం దతృప్తికలిగి యుండును. చతుర్థైకాదశ భావములు బలహీనములయి యుండుటచేత హావుస్ ఆఫ్ కామన్సులోను దేశీయసభలయందును నెదుఱు వాద

ములు కలుగును. గొప్పదియు నందరానిదియునైన స్వాతంత్ర్యములను బ్రజలు కోరుచుందురు.

ప్రభుత్వమువా రిండియాదేశపుఁబ్రజలయెడ దయారసమును వెదఁజల్లి కొన్ని స్వాతంత్ర్యముల నిత్తురు.

చి. సుందరరావు.

యోగిని.

ఆర్యులారా!

కర్నూలునకుఁ బవిత్రురాలైన యొక యోగిని బదరికాశ్రమము నకుఁ బోవుచు బెంగుళూరునుంచి వచ్చియున్నది. ఈయమ యచ్చ టచ్చట నుపన్యసించి స్త్రీపురుషులకు వర్ణాశ్రమధర్మములను బోధించుటలోఁ దన వాగ్ఝరి నుపయోగింపఁ దలఁచియున్నది పక్వపదార్థములు భుజింపదు. కర్నూలుపేట శ్రీరాములవారి యాలయములో 25-4-30 వ తేది జీవాత్మను గుఱించి యుపన్యసించెను. స్త్రీపురుషులు సుమారు 300 మంది సమావేశమైయుండిరి. పరమాత్మకును జీవాత్మకును భేదముఁజూపుచు మాయాప్రపంచమునకు మృదుమధుర శైలితో వ్యాకుచ్చెను.

పుల్లాపంతుల రామచంద్రయ్య.

వర్ణాశ్రమధర్మరక్షక సభాకార్యదర్శి.

మ॥ నిశితకూ్రరతరాసి నస్మదరులన్ నీచాత్ములం జంపి వా
రి శిరశ్శ్రేణుల మెట్లు గట్టెదను గౌరీనాథు లోకానరున్
దశదిగ్వ్యాప్తముఁ జేసెదన్ మదమలోద్యత్కీర్తి. పల్నాటి దు
ర్దశ నేనే తొలఁగింపఁ జూచెదను మోదంబంద మీరెల్లరున్.

సూర్నీ:- చిన్నియన్నా! నీవొక్కఁడవే యననేల నేనుమాత్ర మందు లకుం దీసిపోవువాఁడనే? శీలాంబాగర్భజనితులకు శీలంబు ప్రధానంబగుటఁ బెద్దవాఁడగు నాయుని సచ్ఛీలంబునకు బద్ధులమై యిట్లు కుందవలసివచ్చినది. కుందుచుంటిమి. ఇంకెంత కాలమిటులఁ గుందవలెనో యెఱుంగరాదు. దుర్మదాంధుఁడగు నలసింగకుమావల్లభుని దుశ్చేష్టలు క్షణక్షణంబునను జ్వాలలై మనల భస్మముసేయుచుండ నాజ్వాలల నార్పుటకు బాణవర్షము గురియ వీలుకలుగకున్నది. వారికాలము మంచి దగుటచే మనబారికిఁ జిక్కవలసిన వారయ్యు సింగంబులతో నాడుకొన నమకట్టు చిట్టెలుకల చందంబునఁ దిరుగుచున్నారు. ఏరికినేని యెల్లకాల మొక్కటేరీతి సాగివచ్చునా?

కం॥ ఏనాఁడు బ్రహ్మనాయుఁడు
పూని మనకు రిపులపైకిఁ బో సెల విడునో
ఆనాఁడె యీ దురాత్ముల
ప్రాణంబులు నా కరాసిపా ల్గాకున్నే॥

పేర్నీ:- తమ్ముఁడా! నీ మాటలఁబట్టి యింకను గొంతకాల మోపికతో నుండవలయునని తేలుచున్నది. అక్కటా! దుర్భరము దుర్భరము. ఆ పాపాత్ములు మన ధర్మపద్ధతి కనుగొనలేక మనలఁ బిరికివారలఁగాఁ బరిగణించి యెనలేని కష్టంబులు గలిగించుచుండినను నవాధలవలె ననుభవింపవలయునుగా! చాలుఁ జాలు. ఆమాట లిఁక వినరానఁగూడదు. నే వినఁగూడదు.

ఉ॥ అన్నకుఁ గష్టమైన జను లారడిపెట్టిన బంధువర్గముల్
మన్ననఁజూపకున్న నణుమాత్రము వీరులు నాకుఁ దోడుగా
క్రన్నన రాకయున్నను నొకండనె సంగరభూమిఁ జొచ్చి వి
చ్ఛిన్నముఁజేయనే రిపుల శీర్షములన్ ముదమంద మీరిటన్

నీవైనను నాయుద్యమమునకు వేఱువిధము దలపెట్టనివాఁడవైనచో శత్రువులకు జంకనివాఁడవైనచో నన్ననుసరింపుము. లేకున్నఁ గాలమునకై వేచియుండుము. నేనొక్కరుండనే యీకరవాలము బాసటగా నాలమునం జొచ్చెద. వైరుల నోటుపుచ్చెద. క్షాత్రవంతులగు వీరులకుఁ జేతిఖడ్గముగాక వేఱు తోడేమికావలయును?

సూర్ని॥ అగ్రజా! కోపగించుకొనవేని యొక్కమనవి క్షమించి వినవలయు. నేనుగాని మఱి యితరులుగాని యూరకుండు టాశత్రులకు జంకియో ధర్మమునకు వెఱచియో మీ రెఱుంగనిదికాదు. మీయుద్యమము గాదని నిరసించువాఁ డీసీమలోనే లేఁడు. కాని దేశకాలపాత్రంబు లెఱింగి యింతవరకు నెద్దానికి లోనై తాల్మివహించియుంటిమో యద్దానికే బద్ధులమై కొలఁదికాల ముండవలయునని క్రుద్ధుండవైన నిన్నుఁ బ్రార్థింపవలసివచ్చినది.

పేర్ని-చేతఁగాని యీ యసమయాశ్వాసనలతోఁ బ్రయోజనమేమి? పోసీ నిన్నుఁ గాదననేల, మీరు బుద్ధిమంతులరై యగ్రజాజ్ఞాపరిపాలకులని ఖ్యాతివహించిన వహించుచుదురుగాక. నాకు మాత్రము మాకీర్తితోఁ బనిలేదు. పగతుర మాయలకుఁ జిక్కి మానప్రాణము లరచేతఁబెట్టుకొని బలవంతులమయ్యు నబలలభాతి బ్రదుకుటకంటెఁ బగతురఁ జంపి వీరవిహారస్వర్గ మనుభవించుటో పగతుర జయింపలేకున్న వారిచేఁ జచ్చి వీరస్వర్గ

మనుభవించుటో చూచుకొనెద. అన్నా! ఎంతచిత్రము. విరోధివర్గముఁ బరిమార్చుటకుఁగూడ నింతశాంతియా? ఇట్టి ధర్మోపన్యాసములా? ఇన్ని నీతులకు లోనగుటచేతనే మన కీగతిపట్టినది.

హార్ష్ని - నేను నందులకే దుఃఖించుచుంటిని. విధి మనపాల నన్యథా యుండ మన పౌరుషదర్పంబు లెందునకుఁబనికివచ్చును? కాలముచాలనప్పు డేదివచ్చిన నది యనుభవింపక తప్పదు. అందులకు నలహరిశ్చంద్రాదుల చరిత్రలే నిదర్శనము. పాండుకుమారుల యుదంతములే యుదాహరణము.

పేర్ష్ని - చాలుఁజాలు.

మ॥ విధినిం దూఱెద వేమివెఱ్ఱి? మనమే ప్రేమించి కైకొన్న దీ
వ్యథ కాదేని యనారతంబు మన కన్యాయంబు గావించు నా
యధమాధ్యక్షు జగద్విపక్షు నలసింగాఖ్యుం దదీయప్రజా
బృథివీదూరులఁ జేయ కీగతి వృథా వేదాంతులై యుందుమే.

ఎప్పుడెప్పు డత్తులువల తలలు నఱికి పల్నాటిసీమ ప్రాకారంబు గోపురంబునకుఁ దోరణంబులఁ గట్టుదునాయని తొందరఁజెందుచుంటిని గాని సతతము మీ యొత్తిడులచే నా చిత్తం బుత్తల పడుచుఁ గత్తిని నాచేఁ గుదురుకొననీయక యన్యాయత్తంబుఁ గావించుచుంటచే నా తొత్తులమాఱి వాండ్రపని హెచ్చ మనయొత్తు నశించి పోవుచున్నది. కాని విధిచైదములుకావు. ఇఁక నావిధి యెట్లడ్డము వచ్చునో చూచెదఁగాక. అబ్బా! ఆ నలసింగాధముఁడుగాని జిత్తులమాఱియై లేనిపెత్తనము నెత్తిన వేసికొని మనపాలిటి మిత్త్రియై చిత్తము వచ్చునట్లు వర్తించు నాయకురాలుగాని స్మరణకు వచ్చినప్పు

డెల్ల నాచిత్తం బున్మత్తం బగుచుండును. హా! ఆ పరమ పాతకిని నా లోకకంటకిని నాదేశద్రోహిని గఱకు కరవాలం బున ఖండ ఖండములుగా నఱకి కాకులకు గ్రద్దలకు బలి యిచ్చినఁగాని దాని రక్త ప్రవాహమునఁ బల్నాటి క్షోభా నలంబును జల్లార్చినఁగాని నా మదికి శాంతము గలుగదు. ఆ దుర్జాతి నేమి చేసినఁ బాపము? ఓసీ! మా కొఱకే నీ వీ భువిని మనుజాకృతిని బుట్టితివి కాఁబోలు! మా పల్నాటి నాశనమునకే ని విందు దాపరించితివి కాఁబోలు! మావీరుల పౌరుషనామ విచ్ఛేదమునకే నీవు ప్రాప్తించితివి కాఁబోలు. అక్కటా! నీదెంతవ్యర్థపుజన్మమో నీ గుణము లంతకంటె వ్యర్థములు సుమీ! ఛీ కులటా! అఘటన ఘటనాసమర్థుం డగు నిటలాక్షుని కృపాకటాక్ష వీక్షణముచే నీ యాటలు కొంతవఱకు సాగివచ్చినప్పటికి ముందు సాగవుసుమీ! ఆ నిట లాక్షునే రూపుమాప సిద్ధపడెడు నాకు నీవొక లెక్కలోని దానవగుదువా? ఆకొన్న సింగంబునోట ననాయాసంబుగా మత్తేభంబు పడిన చందంబున నీవు నాభుజపంజరంబునఁ బడ నుంటివి. తమ్ముఁడా! మీరేమియు నన లేదు. నేనేదియు విన లేదు. ఎంతకాలంబునకుఁ బల్నాటి సామ్రాజ్య వినాశ హేతు భూతులగు దుర్మదాంధుల నిర్మూలించు సమయము సిక్కినది. ఇంక నీతో వాదమేల. ఇదే పోవుచుంటిని; గాన నీవు నన్ను వారింపవలదు. వారింపఁదగిన సమయమునుగాదు. వినుము.

శా॥ కాలాగ్నిప్రతిమానరూపమున లోకద్రోహులం జంపఁగా
వీలౌ వేళొక మేనుపూని జనము ల్వీక్షింప రౌద్రింబులౌ
లీలల్చూపెడి మేటిగాని యితఁ డల్లీలంబు శంకించుచున్
వేళన్ వ్యర్థమొనర్చునట్టి తొలి యా పేర్మిఁడుగాఁ డిమ్మొడన్

కాన నాపేరును మఱచి నాయందాసవీడి నాపైఁ బ్రేమను దొలఁగఁద్రోసి నామార్గ మనుసరింపక మీరాయిచ్చ వచ్చినట్లు పొండు. బ్రహ్మనాయుని శాంతవచనముల నిదివఱకు గుప్తపఱచిన ఖడ్గము నిప్పుడు కేలంబట్టితి. మరల దాని నొఱలోఁ దాఁచఁజాల. ఇఁక నాకు మాటాడి నాయుద్యమము నివారింపఁజూచిన నొట్టుఁబెట్టెదఁజుమీ! (క్రోధముతో నలసింగునుద్దేశించి) ఓరోరి పరమపాతకీ! నలసింగరాజా!

శా॥ నీకంటెం గడు దుష్టకష్టమతియై నీచాతినీచాత్మయై
ప్రాఁకం జూచెడు నొక్కకామినికి స్వప్రాణంబు లర్పించి యీ
లోకంబే మది విస్మరించు నినుఁ గాలుంజేర్చి భూభారముం
బీఁకం దింపుతలంపుతోడ నిడుగో పేర్నీఁడు వే వచ్చెడిన్.

సూర్ని:- అక్కటా! ఈవీరునివారించువా రెవ్వరును లేరుగదా! దురాగ్రహావేశుండై యెట్టి హానితోవలం ద్రొక్కునో. ఏదియెట్లైనను బ్రహ్మనాయుని యుద్యమ మింతవఱకుఁ దెలియరాదయ్యె. ఈకోపకారణంబున మాకేమికుటుంబకలహము లంకురించునో. దైవమా మాకేది దిక్కు?

కొమ్మరాజు॥ (తెఱనుండి వచ్చుచు)

ఉ॥ ఆఁగు మిఁకఁ గాఁగుమయ్య సమయార్హముగానటువంటి యిట్టి దు
ర్యోగము మానుమయ్య. మన యాజ్ఞికకీర్తిని మాపునట్టి దు
స్త్యాగముఁ బూనకయ్య. భవదగ్రజుఁడౌ నల బ్రహ్మనాయును
ద్యోగము నాఁగకయ్య యుపయోగము లేదుఁ కిఁకన్ గ్రహించుమా.

(అని పట్టుకొనును) [చుర.

పేర్ని- (వెనుకకుఁ దిరిగిచూడకయే) తమ్ముఁడా! నన్నేల వారించెదవు? నేనెంతబోధించినను నీయజ్ఞానమును విడువవుగదా!

తే॥ తులువలంబట్టి యాజిలోఁ ద్రుంచువఱకు
అగ్గలంబగు నాదు క్రోధాగ్ని యాఱ.
దేల నామీఁది దుర్భ్రమ? యేగుఁ డింక
నాగసానిని ప్రార్థింప నాయుఁ గలసి.

సూర్ని-అన్నా ! నీవెంత పొరపడుచుంటివి. నీపత్నియకోపము పూజ్యుఁడైన బావగారి రాకఁగూడఁ గనుగొననీకయున్నదే.

పేర్ని:- (పరికించి) ఏమీ కొమ్మరాజా ! (వినమ్రుఁడై) బావా ! వందనములు. కోపకారణంబున నీరాక నెఱుంగని నన్ను మన్నింపఁ బ్రార్థించుచున్నవాఁడ.

కొమ్మ:-చిన్నిబావా ! ఒకరు క్షమించుటయు మఱొకరు క్షమింపఁబడుటయునా ? అందఱిని క్షమించుకర్తలు వేఱున్నారు. దానికేమిగాని బావా ! నేఁటి నీచందమరయ ముందటిచందంబున నానందదాయిగాక భయభ్రాంతులఁ గలుగఁజేయుచున్నది.

సీ॥ సితసరోజాత సంతతుల కాంతులగేరు
మోముదామర బిట్టు మోటయయ్యె !
దంతదాడిమముల ధాళధళ్యంబును
వెదఁజల్లు నగవు మార్విధముదోఁచె
కాంచనాభంబైన కమనీయగాత్రంబు
రోమాంచములను నిరుద్ధమయ్యె.
సచ్చింతనంబుఁకో సంతత మలరారు
మనమున రోషయోజనలు పొడమె
మృదులభాషలు కఠినంపుఁ బదములయ్యె
సరస మరసిన నత్యంతవిరసమయ్యె
అవయవంబుల నూత్నంపు ఛవి యెసఁగె
ఆగ్రహస్ఫూర్తి నీమూర్తి యచ్ఛకీర్తి!

పేర్మి:- సహజవీర ప్రతాపుండవై లౌకిక వ్యవహారజ్ఞుండవై జ్ఞాన రూపుండవైన నీకు సామాన్యరసంబునకును వీరరసంబునకును భేదము తెలియకుండునా? అట్టి నీకు నాయందిప్పుడు నూతన తేజము కనంబడుట వింత. నిజమే. నే నిప్పు డొక్కవింతకార్య మాచరింపనుంటి. దానికి నీసాయ మత్యవసరమై యున్నది. కావున నీరాక నాకు సర్వదా మోదావహమైనట్లు నేఁడుగూడ సంతోషదాయకముగానే పరిగణింపఁ జేయుదువుగాక.

కొమ్మ:-నీ కన్యథా ముందెన్నఁడైనను బ్రవర్తించి యుంటివే? ఇప్పు డిట్టి నూతనోపోద్ఘాత మేల?

పేర్మి:-కాదనియే నీకొఱకై నేను రానుండునంతలో నీవే నాయందనుగ్రహించితివి మేలయ్యె. నేఁటి దేశస్థితి గుర్తెఱింగిన నీకు నేను వేఱుగాఁ జెప్పఁబనిలేదు. అయినను వినుము.

కం॥ గురిజాలపురిని నూతన
సరణిని యాగంబుసేయ సమకట్టితి. ధీ
వరులు నుతింపఁగఁ దొల్లిటి
స్థిరసంపద పల్లెనాఁటిసీమకుఁ గలుగన్.

కొమ్మ:-మంచిదే కాని యార్యా! దేశ మల్లకల్లోలముగానుండు నీసందిగ్ధ సమయమునం దిదేటి యజ్ఞము?

పేర్మి:- ఇట్టివేళలయందే చేయఁదగినది మారణయజ్ఞము. దాని విధానముఁ జెప్పెద వినుము.

సీ॥ వీరులు పల్నాటివెలమకులోద్భవుల్
ధీరులు తగిన ఋత్విజులుగాఁగ
సత్యమార్గప్రతాచార సంపత్తిమైఁ
దనరారు నీ వుపద్రష్టగాఁగ

పాయక మా బ్రహ్మనాయుఁడే యాజి త
    త్తరుణి యైతమ సోమిదమ్మగాఁగ
పలనాడె యీయజ్ఞ వాటిక గురిజాల
    పంచిన హోమకుండంబుగాఁగ
నారసింగుండు మంత్రిణి నాగసాని
యజ్ఞపశువులుగాఁగ నత్యధిక దీక్ష
శత్రుమారణయాగంబు సలుపనుంటి.
కోర్కె లిగురొత్త మన కెల్లఁ గొమ్మరాజ!

కొమ్మ:-(తనలో) ఈతఁ డెంతఘోరకార్యమునకు సంకల్పించినాఁడో బ్రహ్మనాయుం డంతకుమించు శాంతితో నున్నాఁడు. ఒకరి దారి యొకరికి మిగుల విరుద్ధమై యున్నది. సర్వకార్యనిర్వాహకుండగు బ్రహ్మనాయుని కెదురాడ వీలులేదు. ఇతని కోపాగ్ని జల్లార్చుట మిగులదుస్తరము. ఎందులకైనను నాయుఁడే సమర్థుఁడుగాని తదన్యు లశక్తులు. ఇతని నిప్పట్టున నెట్టులేని బ్రహ్మనాయునికడకుఁ గొనిపోవుట మేలు. లేకున్నఁ గలవరము కలుగకమానదు. అప్పుడు సమర్థించుకొనుట మఱియుఁ గష్టసాధ్యము. [ప్ర.] బావా! నీయుద్యమము సమంజసమే. నామనోభీష్టముకూడ నట్టిదియే. నీకు నా సంగతి వేఱుగాఁ జెప్పవలయునా? నేనును రిపుమండలి రూపుమాపి దేశక్షేమ మొనరింప బద్ధకంకణుఁడఁగానా? ఇంతయేల

ఉ॥ ఎప్పుడు పెట్టుకొన్నగడు వెంతయుఁ దీఱునో భూతతృప్తిగా
నెప్పుడు శత్రురక్తబలి నిత్తునో వీరవిహారమూర్తినై
యెప్పుడు యుద్ధభూమిఁ జరియింపఁగ నేర్తునో యన్న చింతగా
నెప్పుడు వేఱుచింత గన. నేమివచింతును. నీవెఱుంగవే.